సాక్షి ప్రకాశం

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



అరకొర కేటాయింపులు.. రైతుల జీవితాలతో ఆటలు

జిల్లాలో యూరియా సరఫరాలో అక్రమాల కారణంగా అవసరమైన ప్రాంతాల్లో అందుబాటులో ఉండటం లేదు. అధికారుల తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- 10లో..



జల్సాలకు అలవాటుపడి..

జల్సాలకు అలవాటుపడి బైకులు చోరీలు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి 19 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

- 10లో..

గరిష్ఠం/కనిష్ఠం 32 /26

వాతావరణం

బలమైన గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్యం వికటించి వ్యక్తి మృతి

కొండపి: వైద్యం వికటించి వ్యక్తి మృతిచెందిన సంఘటన మర్రిపూడి మండలం ధర్మవరం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మూలే రమణారెడ్డి (50) జ్వరం, విరేచనాలతో బాధపడుతూ కొండపిలోని ఎన్టీఆర్ బొమ్మ సమీపంలో ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందాడు. ఆర్ఎంపీ వేసిన ఇంజక్షన్ వికటించి సొమ్మసిల్లి పడిపోయాడు. అతని పరిస్థితి విషమంగా మారి అపస్మారక స్థితిలోకి చేరడంతో పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతన్ని పరిశీలించిన వైద్యులు ఒంగోలు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే బంధువులు ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్ఎంపీ వేసిన ఇంజక్షన్ వికటించడం వలనే రమణారెడ్డి మరణించాడని, ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల్లో జేసీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాల అధికారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఫైర్ డిపార్ట్‌మెంట్, రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు, ఇతర శాఖల అధికారులందరూ ఉదయం 8 గంటల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాపులు, ఎంఎల్‌సీ పాయింట్లు, రైస్ మిల్లులు, బాణసంచా గోడౌన్లు, వాటర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్టాండ్లు, సినిమా హాళ్లను కూడా తనిఖీలు చేశారు. పెట్రోలు బంకులు-34, గ్యాస్ ఏజెన్సీలు-12, రేషన్ షాపులు-49, ఎంఎల్ఎస్ పాయింట్లు- 6, రైస్ మిల్లులు-10, బాణసంచా గోడౌన్లు-2, వాటర్ ప్లాంట్లు-13, ఆర్టీసీ బస్టాండ్లు-3, ఫెర్టిలైజర్ షాపులు-2, సినిమా హాళ్లు-6 తనిఖీ చేశారు. మార్కాపురం సబ్ కలెక్టరు బి.సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ, కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి, సహాయ పౌరసరఫరాల అధికారి ఐ.పుల్లయ్య, జిల్లాలోని తహసీల్దార్లు, సివిల్ సప్లయిస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, మండల అగ్రికల్చర్ అధికారులు, జిల్లాలోని వినియోగదారుల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల వద్ద భద్రత ఉండాలి

- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ఈవీఎంలను భద్రపరచిన గోడౌన్ల వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గురువారం ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లాకు సంబంధించిన ఒంగోలు, ఎస్ఎన్ పాడు, కొండపి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి కలిపి మొత్తం 8 నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, అక్కడి భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ చిన ఓబులేసు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఒంగోలు తహసీల్దారు మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

గోరంత పోస్టులకు బస్సంత డప్పు!

చంద్రబాబు ప్రచార యావకు అంతేలేకుండా పోతోంది. చేసేది గోరంత.. ప్రచారం కొండంతగా డీఎస్సీ హైడ్రామా సాగుతోంది. కేవలం 879 మందికి టీచర్ ఉద్యోగాలిచ్చి బాబు చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేసేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి మరీ వెలగపూడి సచివాలయానికి తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 7 వేల మందికి గ్రామ, వార్డు సచివాలయాల కొలువులిచ్చి హుందాగా కాల్ లెటర్లు ఇంటికి పంపించింది.



- 879 మంది ఉద్యోగాలకు ఊరంతా టాంటాం
- 43 ఆర్టీసీ బస్సుల్లో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను వెలగపూడి సచివాలయానికి తరలింపు
- నిధులు ఇవ్వకపోవడంతో తలలు పట్టుకుంటున్న విద్యాశాఖాధికారులు
- నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉమ్మడి జిల్లాలో 7 వేల మందికి ఒకేసారి సచివాలయాల్లో ఉద్యోగాలు
- 293 మంది వైద్యారోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన జగన్ ప్రభుత్వం
- 12 వేల మంది వలంటీర్ల నియామకం
- ఉద్యోగాలిచ్చి హుందాగా వ్యవహరించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ప్రస్తుతం ప్రభుత్వ కార్యక్రమాన్ని కూటమికి ప్రమోషన్‌గా మార్చేశారని విద్యార్థి సంఘాల మండిపాటు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సాధారణంగా ఏ ఉద్యోగ నియామకాలకైనా ఎంపికైన అభ్యర్థికి అపాయింట్మెంట్ ఆర్డర్‌ను రిజిస్టర్ పోస్టు ద్వారా ఇంటికి పంపించడం జరుగుతుంది. ఆన్‌లైన్ విధానం అమలులోకి వచ్చిన తరువాత ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నియామకాలకు సంబంధించిన లిస్ట్ పెట్టడం, నేరుగా అభ్యర్థి మొబైల్‌కు ఈ మెయిల్ మెసేజ్ పంపించడం జరుగుతోంది. కొన్ని ఉద్యోగాలకు కౌన్సెలింగ్ ద్వారా అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వడం అనాదిగా వస్తోంది. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పిన కూటమి నేతలు ఏడాదిన్నర కాలం పాటు కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం అనేక ఆపసోపాలు పడి డీఎస్సీ నిర్వహించింది. అనేక అవకతవకలతో చివరికి ఫలితాలు ప్రకటించినప్పటికీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికీ ఆ సందేహాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీ ఉపాధ్యాయులకు నేరుగా అపాయింట్మెంట్ ఆర్డర్‌ను ఇంటికి పంపించకుండా కుంభమేళా తరహాలో రాష్ట్రస్థాయిలో ఎంపికైన అభ్యర్థులందరినీ వెలగపూడి సచివాలయానికి పిలిపించి మరీ నియామకపత్రాలు అందజేసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టింది. ఇది విమర్శల పాలవుతోంది.

కొత్త ఉపాధ్యాయులకు ఆదిలోనే అగచాట్లు...

జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన వారిలో 661 మంది ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. జోనల్ స్థాయి ఉపాధ్యాయులు 189 మంది కలిపి మొత్తం 849 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 591 మంది పురుషులు, 258 మంది మహిళలు ఉన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులతో పాటు వారి సహాయకులు ఒక్కొక్కరిని వెలగపూడి తరలించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అంటే 849 మంది ఉద్యోగులతో పాటుగా మరో 849 మంది సహాయకులతో కలుపుకుని మొత్తం 1,698 మందిని వెలగపూడి తరలించే బాధ్యత విద్యాశాఖ అధికారుల నెత్తిమీద పడింది. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు, వారి సహాయకులు అనేక వ్యయప్రయాసలకోర్చి ఒంగోలు చేరుకోవాల్సి వచ్చింది. మహిళా అభ్యర్థులు బాగా ఇబ్బంది పడ్డారు. అయితే, వీరిని వెలగపూడి తరలించడానికి ఒంగోలు నుంచి 43 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రే వీరందరినీ జిల్లా కేంద్రమైన ఒంగోలు తరలించారు. వారికి రాత్రి బస ఏర్పాటు చేయడానికి అధికారులు నానా అగచాట్లు పడ్డారు. ప్రైవేటు కళాశాలల్లో వారికి ఏర్పాట్లు చేశారు. ఒంగోలులో దోమల బెడదకు ఉపాధ్యాయులు, వారికి తోడుగా వచ్చిన కుటుంబ సభ్యులు నిద్రలేకుండా నరకం అనుభవించారు. ఏర్పాట్లను పర్యవేక్షించడానికి నలుగురు నోడల్ ఆఫీసర్లను నియమించారు.

ఆర్టీసీ సంగతి దేవుడెరుగు...

డీఎస్సీ నియామకపత్రాలు అందజేయడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా నుంచి 43 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. ఆర్టీసీ నిబంధనల ప్రకారం 16 గంటలకుగానూ 18 వేల రూపాయల అద్దెతోపాటుగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఒక్కో బస్సుకు 20 వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. 43 బస్సులకుగానూ సుమారు రూ.9 లక్షల భారం జిల్లా ఆర్టీసీ మీద పడుతోంది. అయితే, దీనికి కూడా ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించలేదని తెలుస్తోంది. ఈ ఖర్చును రీయింబర్స్ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నట్లు తెలిసింది. ఇటీవల అనంతపురంలో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సభకు జిల్లా నుంచి 300కుపైగా ఆర్టీసీ బస్సులు తరలించారు. దాని బిల్లులు ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ఇక వెలగపూడి సభ తాలూకు బిల్లులు ఎప్పటికొస్తాయో దేవుడికే ఎరుకని ఆర్టీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. దీనికి తోడు 43 బస్సులను వెలగపూడి తరలించడంతో రెగ్యులర్ ప్రయాణికులు నానా అగచాట్లు పడ్డారు.

జగన్ ప్రభుత్వ హయాంలో ఇలా...

కూటమి ప్రభుత్వం కేవలం 849 ఉద్యోగాలిచ్చి చేస్తున్న హడావిడి చూసి కొందరు ముక్కున వేలేసుకుంటున్నారు. కేవలం 849 ఉద్యోగాలకే ఇంత హడావిడి చేస్తే.. వేలాది మందికి ఉద్యోగాలిచ్చిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక ఎంత హంగామా చేయాల్సిందోనని చెప్పుకుంటున్నారు. జగన్ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 7 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలొచ్చాయి. వారందరికీ హుందాగా ఇంటి వద్దకే అపాయింట్మెంట్ ఆర్డర్ పంపించి గౌరవించారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు చోటివ్వకుండా నూరుశాతం పారదర్శకంగా ఉద్యోగాలకు ఎంపిక చేసి చరిత్ర సృష్టించారు. 12 వేల మంది వలంటీర్లను నియమించారు. అలాగే 2001-02లో ఎంపికై కాంట్రాక్ట్ బేసిక్ మీద పనిచేస్తున్న 29 మంది ఫార్మసిస్టులు, 26 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 123 మంది పురుష ఆరోగ్య కార్యకర్తలు, 115 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలను జగన్ ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. 23 ఏళ్ల వారి కలల్ని నిజం చేశారు. అయినప్పటికీ నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎలాంటి హడావిడి చేయలేదు.

ఒక్క రూపాయి నిధులు కేటాయించకుండానే...

ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేయడాన్ని ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా కూటమి ప్రభుత్వ ప్రమోషన్ ఈవెంట్‌గా నిర్వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అత్త సొమ్మును అల్లుడు దానం చేసినట్లు ప్రజల సొమ్ముతో పాలకులు సొంత ప్రచారం చేసుకుంటున్నారని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. అయితే అభ్యర్థులకు ఒంగోలులో బస, భోజన ఏర్పాట్లు చేయడానికి, ఒంగోలు నుంచి వెలగపూడి తరలించడానికి, తిరిగి ఒంగోలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం. దీంతో విద్యాశాఖ అధికారులు ఏం చేయాలో పాలుపోక కిందామీద పడినట్లు తెలుస్తోంది. ప్రైవేటు కళాశాలలు, యాజమాన్యాల కాళ్లు, చేతులు పట్టుకుని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అంతేగాకుండా గత నెలలో రెండు రోజుల పాటు జరిగిన అభ్యర్థుల వెరిఫికేషన్ ప్రక్రియకు, ఆ తర్వాత వారం పాటు చేపట్టిన రీ వెరిఫికేషన్ ప్రక్రియకు ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో సొంత జేబుల నుంచి ఖర్చు పెట్టుకోలేక, వచ్చే జీతం డబ్బు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వైఖరి పట్ల విద్యాశాఖ ఉద్యోగులలో అసంతృప్తి కనిపిస్తోంది.

పండుగ రోజుల్లో బస్సుల కొరత

పెద్దదోర్నాల: కూటమి ప్రభుత్వ తీరుతో పండుగ రోజుల్లో గమ్యస్థానాలకు చేరేందుకు బస్సులు లేక ప్రయాణికులు అవస్థపడ్డారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ 2025లో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందించేందుకు వారందరినీ అమరావతి తరలించే ఆర్భాటపు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం బస్సులు తరలించింది. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో డీఎస్సీ 2025లో 3,750 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిని అమరావతి తీసుకెళ్లి నియామకపత్రాలు అందించేందుకు వారితో పాటు మరో 3,750 మంది సహాయకులను సైతం తరలించేందుకు ప్రభుత్వం 150 బస్సులు కేటాయించింది. ఆయా జిల్లాల అభ్యర్థులను తీసుకొచ్చేందుకు బుధవారం బస్సులను వారి స్వస్థలాలకు పంపించారు. దీంతో అభ్యర్థులు బుధవారం ఆయా జిల్లాల నుంచి అమరావతి తరలివెళ్లారు. ఈ తతంగమంతా పూర్తయ్యేసరికి పూర్తిగా రెండు రోజుల సమయం పట్టడంతో గురువారం కూడా ప్రయాణికులకు తీవ్ర బస్సుల కొరత ఏర్పడింది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి అధిక శాతం బస్సులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తుంటాయి. ఆయా రూట్లలో ఓ ఐదు ఆర్డినరీ సర్వీసులు మినహా మిగతావన్నీ సూపర్ ఎక్స్‌ప్రెస్‌లే తిరుగుతుంటాయి. డీఎస్సీ అభ్యర్థుల కోసం సూపర్ ఎక్స్‌ప్రెస్‌లు కేటాయించటంతో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో బుధ, గురువారాలలో పెద్దదోర్నాల మండల కేంద్రం నుంచి శ్రీశైలం వెళ్లేందుకు బస్సులు లేకపోవటంతో పలువురు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేశారు.



బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

రోడ్డెక్కిన అధికార పార్టీ రాజకీయం

- కారుమంచి సాగర్ కాలువ కట్టకు మరమ్మతుల విషయంలో టీడీపీలోని ఓ వర్గం ఆందోళన బాట
- రైతుల పేరుతో ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా
- అధికారులు మాట వినకపోవడం, ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు
- కాలువ కిందున్న గ్రానైట్ నిక్షేపాల కోసం కాలువను పక్కకు తరలించాలనే కుట్రలపై నిరసన
- కాలువ పక్కనున్న మధుకాన్ గ్రానైట్ క్వారీ యాజమాన్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కయారనే ఆరోపణలు
- సొంత పార్టీ నాయకులే ధర్నా చేయడంతో టీడీపీ పాలకులు, అధికారులు అభాసుపాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సాగర్ కాలువ కారుమంచి మేజర్ కట్టకు మరమ్మతుల విషయంలో తలెత్తిన విభేదాలతో అధికార టీడీపీలోనే రాజకీయం రాజుకుంది. చివరకు కొందరు టీడీపీ నాయకులు ఏకంగా రోడ్డెక్కి ఆందోళన బాట పట్టడం ఆ పార్టీ పాలకులు, అధికారుల అవినీతి, నిర్లక్ష్యపు పనితీరును ఎండగడుతోంది. కాలువ కట్టకు మరమ్మతుల సమస్య పరిష్కరించాలని కోరుతూ కొంతమంది రైతులతో కలిసి పేరుమోసిన టీడీపీ నాయకులు రెండు రోజుల క్రితం ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడంతో జిల్లాలో టీడీపీ అభాసుపాలైంది. టీడీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల తీరును విభేదించి రైతులతో కలిసి ఆ పార్టీకి చెందిన మార్కెటింగ్ కమిటీ, టీడీపీ చీమకుర్తి రూరల్ మండల అధ్యక్షుడు, పలు నీటి సంఘాల నాయకులు, మాజీలు, మున్సిపల్ చైర్మన్ పదవికి, ఇతర పదవులకు పోటీపడగలిగే స్థాయి కలిగిన పలువురు నాయకులు ధర్నా చేయడం చర్చనీయాంశమైంది.

మధుకాన్ చుట్టూ తిరుగుతున్న టీడీపీ రాజకీయం...

సాగర్ కాలువ ఒంగోలు బ్రాంచ్ కెనాల్ నుంచి చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని దాదాపు 50 గ్రామాలకు సుమారు 130 క్యూసెక్కుల నీటిని తరలించే కారుమంచి మేజర్ కట్ట విరిగి దాని పక్కనే ఉన్న మధుకాన్ గ్రానైట్ క్వారీ లోయలో పడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆ కాలువ కట్టకు మరమ్మతులు నిర్వహించే విషయం మధుకాన్ గ్రానైట్ క్వారీ చుట్టూ తిరుగుతోంది. ప్రస్తుతం టీడీపీ నాయకులు రోడ్డెక్కడానికి కూడా కారణం మధుకాన్ గ్రానైట్ క్వారీనే కావడం విశేషం. ఈ క్వారీ యజమాని నామా నాగేశ్వరరావు ఒకప్పుడు తెలంగాణలో టీడీపీకి చెందిన ఎంపీ. కాగా, రైతులకు సాగునీరు, 50 గ్రామాల ప్రజలు, పశువులకు తాగునీరు సరఫరా చేసే కారుమంచి మేజర్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి కలెక్టర్ రూ.2.62 కోట్ల నిధులను ఈ సంవత్సరం జూన్ నెలలోనే మంజూరు చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సిఫార్సుల మేరకే ఆ నిధులు మంజూరైనట్లు కొందరు టీడీపీ నాయకులు చెబుతున్నారు. అయితే, ఆ నిధులతో కారుమంచి మేజర్‌కు మరమ్మతులు చేయడాన్ని ఇరిగేషన్ ఉన్నతాధికారులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కేవలం మధుకాన్ గ్రానైట్ క్వారీ యాజమాన్యానికి మేలు చేసేందుకు అలా చేస్తున్నట్లు సమాచారం. రైతులకు అనుకూలంగా కాకుండా క్వారీ యాజమాన్యానికి మేలు చేసే విధంగా కాలువకు మరమ్మతులు చేసేందుకు ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సులతో అధికారులు అలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలా కాకుంటే అధికారులను ఎంపీ, ఎమ్మెల్యేలు ఒప్పించలేకపోతున్నారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ధర్నా చేసిన టీడీపీ నాయకుల మాటలను నియోజకవర్గ స్థాయి నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యేలు పెడచెవిన పెట్టారా..? వారు చెప్పినా జిల్లా స్థాయి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదా..? ఇలా పలు ప్రశ్నలకు సమాధానాలు లేక చివరకు అధికారులు, పాలకులు, నియోజకవర్గ నాయకులు తీరుపై రైతుల పేరిట మండల స్థాయి టీడీపీ నాయకులు రోడ్డెక్కి ధర్నా చేయాల్సి రావడం పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.



ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద కొంతమంది రైతులతో కలిసి ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

క్వారీ యాజమాన్యం అడ్డుపడుతోంది నిజమేనా..?

సాగర్ కాలువ కట్ట పునర్నిర్మాణానికి మధుకాన్ క్వారీ యాజమాన్యం మోకాలడ్డుతోంది నిజమేనా..? అంటే జిల్లా, రీజినల్ స్థాయిలోని ఇరిగేషన్ అధికారుల నుంచి నిజమేననే సమాధానాలు వస్తున్నాయి. ఒకప్పుడు టీడీపీకి చెందిన ఎంపీ నామా నాగేశ్వరరావుకు చెందిన మధుకాన్ గ్రానైట్ క్వారీ కారుమంచి మేజరు ఒడ్డున ఉంది. వాస్తవానికి గ్రానైట్ బఫర్ జోన్ నిబంధనలను తుంగలో తొక్కి కాలువ ఒడ్డు వరకు తవ్వటం, అదే కాలువ కట్టపై భారీ గ్రానైట్ రాళ్లతో ట్రాలీలు తిరగడం వలన కాలువ కట్ట బలహీనపడింది. కాలువ ఒడ్డు దాదాపు 50 మీటర్ల పొడవున విరిగి పక్కనే ఉన్న మధుకాన్ గ్రానైట్ క్వారీలో పడింది. విరిగి పడిన కాలువ కట్ట నుంచి కాలువ కిందిగా ఉన్న భూమిలో మధుకాన్ క్వారీ పరిధిలో కోట్లాది రూపాయల విలువ చేసే గ్రానైట్ నిక్షేపాలున్నాయి. కారుమంచి కాలువ కట్టను పునర్నిర్మిస్తే వాటిని తిరిగి తవ్వుకోవడానికి వీలు కాదు. ఎలాగో కారుమంచి కాలువ విరిగి క్వారీలో పడింది. ఇప్పుడు దాని ద్వారా సాగర్ నీటిని తరలించడం వీలు కాదు. అందుకే కారుమంచి కాలువను దూరంగా ఉన్న ఇతర భూములలో నిర్మించేందుకు అనుమతినిస్తే తామే నిర్మిస్తామంటూ మధుకాన్ గ్రానైట్ క్వారీ యాజమాన్యం ఇరిగేషన్ రాష్ట్ర, రీజినల్ స్థాయి అధికారులకు లేఖల మీద లేఖలు రాస్తోంది. దానిలో ఇరిగేషన్ అధికారులకు కూడా ఎంతో కొంత ఆర్థికంగా మేలు జరిగే అవకాశాలుండటంతో ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. కారుమంచి కాలువ నుంచి రైతులకు గతంలో 130 క్యూసెక్కుల నీరు ప్రవహించేది. ఇప్పుడు తాత్కాలిక మరమ్మతుల పేరుతో పైపుల ద్వారా లేకటబ్ విధానంలో సాగర్ నీటిని పంపించేందుకు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, ఆ విధానం ద్వారా చాలీచాలని నీరు దిగువనున్న రైతులకు సరిపోవడం లేదని, దానిని పూర్తిగా గతంలోలా 130 క్యూసెక్కుల నీరిచ్చే విధంగా నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దాని ఆధారంగా మధుకాన్ క్వారీ యాజమాన్యం కారుమంచి కాలువను పక్కకు తప్పించాలనే ఆలోచనలకు రాష్ట్రస్థాయిలో ఒకరిద్దరు అధికారులు మద్దతు తెలపటంతో దానిని అడ్డుకునేందుకు రైతులు ప్రయత్నం చేస్తున్నారు. రైతులకు అనుగుణంగా కారుమంచి కాలువను పునర్నిర్మించేందుకు నియోజకవర్గ టీడీపీ నాయకులు, పాలకులు బాధ్యత తీసుకుని పనిచేయడం లేదంటూ మండల స్థాయి నాయకులు ధర్నా చేశారు. మొత్తం మీద టీడీపీ నాయకులు అధికారంలో ఉండి కూడా ధర్నా చేయటం ఆ పార్టీ పరిపాలనా వైఫల్యాలను ఎత్తి చూపుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

దీనిపై ఇరిగేషన్ ఉన్నతాధికారులను వివరణ కోరగా, కారుమంచి మేజర్‌ను ఇప్పుడున్న స్థానంలోనే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాకపోతే కాలువను మళ్లీ నిర్మించేందుకు సాయిల్ టెస్ట్ చేపిస్తున్నామన్నారు. గతంలో కాలువ డిజైన్‌కు సంబంధించి పంపించిన సమాచారం లోపభూయిష్టంగా ఉండటంతో దానిని తిరిగి పూర్తి సమాచారంతో పంపించాలని జిల్లా అధికారులకు విజయవాడలోని సీఈసీడీఓ విభాగం లేఖ రాసింది. నూతనంగా తయారు చేసిన డిజైన్ రిపోర్ట్, ఇతర సమాచారం రాగానే కారుమంచి కాలువను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేస్తున్నారు.

డిజైన్, ఫీల్డ్‌డేటాను మళ్లీ అడిగాం

కారుమంచి కాలువ నిర్మాణానికి కావాల్సిన డిజైన్, ఫీల్డ్ డేటాను మళ్లీ అడిగాం. వాటిని సీఈసీడీఓకి పంపించాల్సి ఉంటుంది. వారి నుంచి రిపోర్ట్ రాగానే కారుమంచి కాలువ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. కారుమంచి కాలువను తమకు ఇవ్వాలని మధుకాన్ గ్రానైట్ క్వారీ వారు ఉన్నత స్థాయి అధికారులకు లేఖలు రాసిన మాట వాస్తవమే.

- శ్యామ్‌ప్రసాద్, సీఈ, ఇరిగేషన్ డిపార్టుమెంట్



కరెన్సీ నోట్లు, బంగారు ఆభరణాలతో లక్ష్మీదేవి అలంకరణలో ఒంగోలు అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారు

ఓం శ్రీ మాత్రే నమః..

దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం నాలుగో రోజు జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలలో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించి విశేష పూజలు చేశారు.

సీబీజీ ప్లాంట్‌ను పరిశీలించిన కలెక్టర్

పీసీ పల్లి: మండల పరిధిలోని దివాకరపురం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న సీబీజీ ప్లాంట్‌ను కలెక్టర్ రాజాబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్లాంటుకు కేటాయించిన భూమిలో సాగుకు ఎంత ఉపయోగపడుతుంది, ఎంత ఉపయోగపడదనే విషయంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్లాంట్ ప్రతినిధులకు సూచించారు. ప్లాంటు నిర్మించే 30 కిలోమీటర్ల పరిధిలో ఎంత ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందో నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి వీఆర్‌ఓగా బాలేశ్వరరావు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

యర్రగొండపాలెం: మండలంలోని కొలుకుల పంచాయతీ ఇన్‌చార్జి వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న కర్రె బాలేశ్వరరావును తొలగించి బోయలపల్లి వీఆర్వో ఓబయ్యను ఇన్‌చార్జి వీఆర్వోగా నియమించినట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. గంగపాలెం వీఆర్వోగా పనిచేస్తున్న బాలేశ్వరరావు తన స్వగ్రామమైన కొలుకుల ఇన్‌చార్జిగా వేయించుకున్నాడు. నియోజకవర్గ పచ్చ నేత అండతో ఓ వర్గాన్ని రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాడని, ఈ విషయంపై 3 నెలల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదు. ఈ క్రమంలో ఆ గ్రామస్తుల ఆవేదన బుధవారం సాక్షి దినపత్రికలో ×పైసలిస్తేనే పని.. ప్రత్యర్థులకు వేధింపులు× అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. బాలేశ్వరరావును తన స్వగ్రామం నుంచి ఇన్‌చార్జి వీఆర్వోగా తొలగించి మరో వీఆర్వోను నియమించారు. దీంతో కొలుకుల గ్రామస్తులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేట్‌లో శాశ్వత కమాండ్ కంట్రోల్ రూం



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ

ఒంగోలు సబర్బన్: ప్రకాశం భవన్‌లో శాశ్వత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ కమాండ్ కంట్రోల్ రూంను డీఆర్‌ఓ బీసీహెచ్ ఓబులేసు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించిన సేవలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేలా కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి టి.రవి, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

బాలసదన్‌కు చేరిన శిశువు



శిశువును అప్పగిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గిద్దలూరు రూరల్: గుర్తు తెలియని ఓ తల్లి తన పేగు బంధాన్ని వద్దనుకొని పురిటిబిడ్డను స్థానిక వైద్యశాలలో వదిలివెళ్లిన విషయం తెలిసిందే. ఈ మగ శిశువును పట్టణంలోని చిన్నపిల్లల వైద్యశాలల్లో రెండు రోజుల పాటు చికిత్స అందించారు. అనంతరం బిడ్డ తల్లి కోసం ఎంత గాలించినా కనిపించలేదు. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ఆ చిన్నారిని ఒంగోలు బాలసదన్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి దినేష్‌కుమార్‌కు అప్పగించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చీమకుర్తి రూరల్: రామతీర్థం జలాశయం నుంచి ఒంగోలు వెళ్లే ఎన్ఎస్పీ కాలువలో తూర్పు బైపాస్ జంక్షన్లో ఏలూరివారిపాలెం లాకులు వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్సై కథనం ప్రకారం..మృతుని వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతదేహం కుడిచేతిపై అమ్మానాన్న, కుడిచేతి మణికట్టు వద్ద నాని అని పచ్చబొట్టు ఉంది. మృతుని వివరాలు తెలిస్తే చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

అరకొర కేటాయింపులు..
రైతుల జీవితాలతో ఆటలు..

యూరియా సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. ఒక్క బస్తా కోసం రైతులు విలవిలలాడుతుంటే అరకొరగా వచ్చిన యూరియాను సైతం అవసరమైన ప్రాంతాలకు కేటాయించడం లేదు. అసలు జిల్లాకు ఎంత యూరియా అవసరం..ఎంత నిల్వ ఉంది..ఎక్కడకు కేటాయించాలన్న నిర్దిష్ట ప్రణాళిక కరువైంది. ఫలితంగా అరకొరగా ఉన్న యూరియా పక్కదారి పడుతోంది. అధికారుల తీరు బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహించాలే ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- జిల్లాలో యూరియా సరఫరాలో అక్రమాలు
- అవసరమైన ప్రాంతాల్లో అందుబాటులో ఉండని వైనం
- అవసరం లేని ప్రాంతాలకు తరలించి బ్లాక్‌కు తరలించేందుకు పన్నాగం
- అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం



వరి పంట వేసి యూరియా కోసం ఎదురు చూస్తున్న పొలాలు

దర్శి:

జిల్లాలో సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ఈ పాటికే నార్లు పోశారు. కొన్ని ప్రాంతాల్లో నాట్లు కూడా వేశారు. ఈ తరుణంలో ప్రతి రైతుకు యూరియా తప్పనిసరి. అయితే యూరియా కేటాయింపుల్లో సైతం అధికారులు పచ్చపాతం చూపిస్తున్నారు. ఫలితంగా యూరియా రైతులకు అందడం లేదు. జిల్లాకు కేటాయించిన యూరియాలో 70శాతం మార్క్‌ఫెడ్‌కు కేటాయించారు. మార్క్‌ఫెడ్ నుంచి సొసైటీలకు యూరియా సరఫరా చేస్తున్నామని చెబుతున్నారే గానీ ఆచరణలో మాత్రం ఏ సొసైటీలో కూడా యూరియా కనిపించడం లేదు. సొసైటీ నిర్వాహకులను సంప్రదిస్తే జిల్లా అధికారులు అలాట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్తున్నారు. ఈ క్రమంలో అత్యవసరంగా యూరియా అవసరమైన రైతులు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. బయట ఎరువుల దుకాణాల్లో యూరియా కొనుగోలు చేయాలంటే ఇతర ఎరువులూ కొనుగోలు చేస్తేనే ఒక బస్తా యూరియా ఇస్తామని తెగేసి చెబుతున్నారు. అది కూడా రూ.266లకు అమ్మాల్సిన యూరియాను రూ.400 నుంచి రూ.450లకు విక్రయిస్తున్నారు. యూరియా కోసం వెళితే ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని బెదిరించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఈ విధంగా ఉన్న అధికారులు మాత్రం మొక్కుబడి తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు.

సొసైటీలకు ఎరువుల కేటాయింపు ఎక్కడ..?

జిల్లాలో 91 పీఏసీఎస్‌లు, నాలుగు మల్టీస్టేట్ (ఎంఎస్‌సీఎస్)సొసైటీలు, ఐదు టుబాకో సొసైటీలు ఉన్నాయి. వీటిలో 15 పీఏసీఎస్‌లు, నాలుగు మల్టీ స్టేట్ సొసైటీలు, టుబాకో సొసైటీలు రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నాయి. ఈ సొసైటీలకు మార్క్‌ఫెడ్ నుంచి నేరుగా ఎరువులు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం జిల్లా వ్యవసాయాధికారులు గత 15 రోజులుగా వారికి అనుకూలైన ఆర్‌బీకేలు, సొసైటీలకు మాత్రమే ఎరువులు కేటాయిస్తున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతమైన దర్శి నియోజకవర్గంలో 15 సొసైటీలు ఉండగా 7 సొసైటీలకు మాత్రమే అరకొరగా ఎరువులు సరఫరా చేశారు.

పక్కదారి పట్టించేందుకే..

యూరియాను పక్కదారి పట్టించేందుకు అధికారులు కొత్త దారిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. తమకు అనుకూలంగా ఉండే ఆర్‌బీకేలకు అధిక మొత్తంలో కేటాయించి అక్కడ నుంచి పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా సాగర్ నీరు అందుబాటులో లేని, ఎరువులు అవసరం లేని ప్రాంతాలకు యూరియా కేటాయించి అక్కడ నుండి బయట ఎరువుల దుకాణాలకు బిల్లులు లేకుండా యూరియా తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ తతంగం మొత్త జిల్లా వ్యవసాయాధికారుల కనుసన్నల్లో మండల వ్యవసాయాధికారులు నడిపిస్తున్నట్లు సమాచారం. ఇదే తరహాలో తరలించిన యూరియా జిల్లాలో అనేక ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అన్నీ ఆర్బీకేల పరిధిలో వ్యవసాయాధికారులు పర్యవేక్షణలోనే ఈ తతంగం సాగినట్లు తెలిసింది.

పశుపోషకుల పరిస్థితి దయనీయం..



యూరియా కోసం ఎదురు చూస్తున్న గడ్డి చేలు

రాష్ట్రంలో ప్రకాశం జిల్లా పాడిలో ముందంజలో ఉంటుంది. జిల్లాలో పాడిపై ఆధారపడి జీవించే రైతులు అధికం. అయితే పాడికోసం పెంచుతున్న పచ్చగడ్డికి కేవలం యూరియా మాత్రమే వాడతారు. యూరియా వేస్తేనే మేత త్వరగా పెరిగి కోతకు వస్తుంది. అయితే ప్రస్తుతం యూరియా అందుబాటులో లేకపోవడంతో పశువుల గడ్డి పెంచే పశుపోషకులు ఏం చేయాలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడా బస్తా యూరియా కూడా ప్రస్తుతం అందని పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- ముగ్గురు మోటార్‌బైక్ దొంగల అరెస్టు
- నిందితుల నుంచి 19 వాహనాలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నారు. సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా నరసారావుపేట మండలం గురువాయపాలెం గ్రామానికి చెందిన తాళ్లూరి గాబ్రియేల్, బండారు నవీన్, మరో బాలుడు ముగ్గురు స్నేహితులు. ఒకే గ్రామానికి చెందిన వీరు జల్సాలకు అలవాటుపడ్డారు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు ద్విచక్రవాహనాలను చోరీ చేయడం మొదలుపెట్టారు. వీరిపై నరసరావుపేట వన్ టౌన్ పోలీసుస్టేషన్లో 6 మోటారు బైకులను దొంగతనాలు చేసినట్లు కేసు నమోదైంది. అదే విధంగా ఒంగోలు వన్‌టౌన్ పరిధిలో 5 బైక్‌లు, ఒంగోలు టూటౌన్ పరిధిలో మూడు, తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 మోటార్ బైక్‌లను దొంగించిన కేసులు నమోదై ఉన్నాయి. అదే విధంగా టంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, అద్దంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదయ్యాయి. ఈ చోరీలను సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు డీఎస్పీ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ జగదీష్, తాలుకా సీఐ టి.విజయ కృష్ణ, ఎస్సై హరి బాబు, సీసీఎస్ సిబ్బందితో రెండు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అన్నీ కోణాల్లో విచారణ చేసిన పోలీసు బృందాలు గురువారం నగరంలోని నేతాజీ కాలనీ శివారు వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 19 మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.13.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

- పరిశ్రమల అనుబంధ విభాగాల సమీక్షలో కలెక్టర్ రాజాబాబు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: పరిశ్రమల్లో భద్రత పరమైన చర్యలు తప్పక తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు పరిశ్రమల శాఖ అధికారులతో పాటు అనుబంధ విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలోని తన ఛాంబర్లో గురువారం జిల్లా పరిశ్రమల కేంద్రం, ఫ్యాక్టరీలు, కార్మిక, ఏపీఐఐసీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో పర్యావరణ సంబంధ నిబంధనలను కచ్చితంగా పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని వివిధ తరహా పరిశ్రమలు, వాటికి ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీలు, అనుమతులు మంజూరు చేస్తున్న విధానం, భద్రతా ప్రమాణాలు, కేంద్ర, రాష్ట్ర పథకాలను అమలు చేస్తున్న తీరుపై ఆయన ఆరా తీశారు. సంబంధిత వివరాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ కార్మికులకు భద్రతాపరంగా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని, ఈ దిశగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ దిశగా ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరగరాదన్నదే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రాఘవరెడ్డి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రిదేవీ, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ మదన్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి. ఈశ్వర్‌చంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పొలం తగాదాలో కత్తితో దాడి



తలకు గాయమైన బ్రహ్మనాయక్

గిద్దలూరు రూరల్: పొలం విషయంలో ఘర్షణకు దిగి భార్యభర్తలపై కత్తితో దాడి చేశారు. ఈ సంఘటన మండలంలోని ఓబులాపురంతాండాలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఇస్లావత్ బ్రహ్మానాయక్, ఇస్లావత్ హస్లీబాయ్ భార్యభర్తలు. వారిపై ప్రత్యర్థులైన కాశీనాయక్, అతని తల్లిదండ్రులు కేశాలనాయక్, లక్ష్మీబాయ్‌లు కత్తితో దాడి చేశారు. బ్రహ్మనాయక్ అనుభవంలో ఉన్న పొలం తనదంటూ కేశాలనాయక్ అతడి కుమారుడు కాశీనాయక్‌లు తప్పుడు ఆధారాలు సృష్టించి ఏడాది నుంచి ఘర్షణకు దిగుతూ కేసులు పెట్టుకున్నారు. ఈ క్రమంలో కాశీనాయక్ పొలంలో డ్రిప్ ఏర్పాటు చేసుకునేందుకు వెళ్లగా ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో కాశీనాయక్ కత్తితో వారిపై దాడికి పాల్పడ్డాడు. బ్రహ్మనాయక్ వర్గం వారు కూడా కాశీనాయక్‌పై దాడికి పాల్పడినట్లు తెలిసింది. గాయాలపాలైన బ్రహ్మనాయక్, హస్లీబాయ్‌లు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదానికి గురైన ఆటో

కంభం: ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తుడిమెళ్ల గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..బేస్తవారిపేట గ్రామానికి చెందిన ఈ.బాలగురుమూర్తి ఆటోలో ఏడుగురు కూలీలు వ్యవసాయ పనులు చేసేందుకు తుడిమెళ్ల గ్రామానికి వెళుతున్నారు. ఆటో అంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు మలుపు వద్ద రాగానే ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాలగురుమూర్తితో పాటు ఆకుల నారాయణమ్మ, షేక్.మీరాభి, మహలక్ష్మిలకు తీవ్రంగా గాయాలు కాగా మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

ఎయిర్‌పోర్టు భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

కొత్తపట్నం: మండల పరిధిలో అల్లూరు ఆలూరు మధ్యలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అవసరమైన భూములను కలెక్టర్ పి.రాజాబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే 700 ఎకరాలను గుర్తించామని, అవసరమైతే వెంటనే సేకరిస్తామని చెప్పారు. అనంతరం ఆలూరు-అల్లూరు మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. కలెక్టర్ వెంట జేసీ జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీఓ కళావతి, తహసీల్దార్ శాంతికుమారి, సర్వేయర్ సుధీర్‌బాబు, ఆర్‌ఐ వరకుమార్, సిబ్బంది ఉన్నారు.

తాళ్లూరు: మండలంలో జరుగుతున్న బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ ఆర్ గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను నిర్దేశించిన సమయం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులతో సమావేశమయ్యారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే పీడీ అనీల్‌కుమార్, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీపీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యడమకంటి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మారం వెంకారెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దాడిలో ఒకరు మృతి



వెంకటయ్య మృతదేహం

అర్ధవీడు: మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేయగా ఒకరు మృతి చెందారు. ఎస్సై శివనాంచారయ్య కథనం ప్రకారం..గన్నెపల్లి బీసీ కాలనీకి చెందిన నల్లబోతుల బాలవెంకటయ్య(55) బస్టాండ్ సెంటర్‌లో నిల్చోని ఉండగా మతిస్థిమితం లేని అబ్దుల్లాఖాన్ అనే వ్యక్తి వెనుక నుంచి కర్రతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంకటయ్యను చికిత్స నిమిత్తం యాచవరం ప్రాథమిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు అబ్దుల్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

కలిసి పుట్టారు..కలిసిపోయారు



రోదిస్తున్న కుటుంబసభ్యులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

వాళ్లిద్దరు కవలలు. ఒకే రూపం. పుట్టకలాగే ఏం చేసినా ఒక్కటిగానే. కలిసి పాఠశాలకు వెళతారు. కలిసి చదువుకుంటారు. ఆడినా, పాడినా కలిసే ఉంటారు. వారిని చూసి విధికి కూడా కన్నుకొట్టిందేమో. ఇద్దరినీ ఒకేసారి తీసుకువెళ్లిపోయింది. ఆ ఇద్దరూ మృత్యువులోనూ విడిపోకుండా కలిసి వెళ్లిపోయారు. ఈ హృదయ విధారకర సంఘటన దర్శి మండలం చలివేంద్ర గ్రామంలోని జగనన్న కాలనీలో జరిగింది. దసరా సెలవులకు విజయవాడ నుంచి అమ్మమ్మ ఊరికి వచ్చిన నిఖిల్, అఖిల్ నీటి కుంటలో పడి మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.